సాక్షి
కర్నూలు
గురువారం । 27 । జూన్ । 2024



300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా కేసీ కెనాల్‌కు 256 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లో 1.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం నందికొట్కూరు లక్షితా శ్రీ నృత్య కళాశాల బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది.

సాక్షి గణపతికి విశేష పూజలు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రంలో లోక కళ్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సామాన్యులకు అందుబాటులో ఉల్లి, టమాటాలు

● వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జి కలెక్టర్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఉల్లి, టమాటాలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్/జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌లో టమాటా, ఉల్లి ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు బజార్లలో నో లాస్ నో గెయిన్ కింద ఉల్లి, టమాటాల విక్రయం చేపట్టాలన్నారు. టమాటాలను చిత్తూరు, ఉల్లిని మహారాష్ట్ర నుంచి తెప్పించాలన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలోనే ఉల్లి, టమాటాల దిగుబడి వచ్చే అవకాశం ఉండడంతో అంతవరకు ధరలు పెరగకుండా చూడాలన్నారు. అనంతరం రైతు బజార్లలో ఉల్లి, టమాటా ధరలను ఎస్టేట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధరలను ఒక్కసారిగా పెంచొద్దని హాజరైన హోల్‌సేల్ వ్యాపారులకు సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

8,532 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు అనుమతులు

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 సంవత్సరానికి సంబంధించి జూన్ నెల 25 నాటికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం నిర్ణీత రుసుం చెల్లించిన రైతులకు కనెక్షన్లు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8,532 విద్యుత్ కనెక్షన్లకు రైతులు తమ వాట కింద పూర్తి ఫీజు చెల్లించినారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రైతుల బోర్లకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు సన్నాహాలు మొదలు పెట్టామన్నారు. ఇందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల కొత్తగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి డిమాండ్ నోటీసులు ఇవ్వడం, మంజూరు పత్రాల జారీ నిలిపివేశామన్నారు. తాజాగా కోడ్ ఎత్తేయడంతో దరఖాస్తు చేసుకున్న రైతులకు డిమాండ్ నోటీసులు ఇవ్వడంతో పాటు అమౌంటు చెల్లించిన రైతులకు మంజూరు పత్రాలు ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చే సిందన్నారు. బోరు ఉన్న రైతులు మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కర్నూలు ఎఫ్ఆర్ఓగా విజయకుమార్



కర్నూలు కల్చరల్: అటవీ శాఖ కర్నూలు డివిజన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా జి.విజయకుమార్ నియమితులయ్యారు. తిరుపతి డివిజన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇతనికి ఎఫ్ఆర్ఓగా పదోన్నతి కల్పించి కర్నూలు డివిజన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డి రిలీవ్ అయ్యారు.

కరువు ప్రాంతాలకు 'ఉపాధి' ఊరట



ఆస్పరి మండలం హాలిగేర గ్రామంలో ఫాంపాండ్ తవ్వుతున్న ఉపాధి కూలీలు

- ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో 30, రబీలో 30 కరువు మండలాలు
- ఆయా ప్రాంతాల్లో ఫోకస్‌గా 'ఉపాధి' పనులు
- ఇప్పటి వరకు 88 లక్షలకుపైగా పనిదినాల కల్పన
- 'ఉపాధి' కూలీలకు రూ.231.33 కోట్ల చెల్లింపులు
- పండ్ల తోటల అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం గుంతలు తవ్వుకునే పనులకు ప్రాధాన్యత

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కరువు ప్రాంతాలకు కల్పతరువుగా మారింది. గతేడాది ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో 6 మండలాలను, రబీ సీజన్‌కు సంబంధించి కర్నూలు జిల్లాలో 18, నంద్యాల జిల్లాలో 12 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా మండలాల్లో కరువు పనులను ఫోకస్‌గా నిర్వహించారు. దీంతో చిన్న, సన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఊరట లభించింది. మూడు నెలల్లోనే కర్నూలు జిల్లాలో 43.28 లక్షలు, నంద్యాల జిల్లాలో 44.87 లక్షలు.. మొత్తంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 88.12 లక్షల పని దినాలు కల్పించారు. రోజుకు 2.50 లక్షల మంది కూలీల చొప్పున పనులకు హాజరయ్యారు. వర్షాలు పడటం, వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో కొద్ది రోజులుగా 'ఉపాధి'కి డిమాండ్ తగ్గింది. జూన్ నెలలో రోజుకు 1,53,500 మందికి ఉపాధి పనులు కల్పించాలనేది లక్ష్యం కాగా..ప్రస్తుతం 12 వేల మంది మాత్రమే హాజరవుతున్నారు.

రూ.231.33 కోట్ల చెల్లింపులు

కరువు కాలంలో ఉపాధి కూలీలకు వేతనాల కింద రూ.231.33 కోట్లు చెల్లించారు. కర్నూలు జిల్లాలో రూ.125.97 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.105.36 కోట్లు చెల్లించడం విశేషం. కూలీలకు రోజుకు సగటున రూ.270 వరకు వేతనం దక్కింది. 2024–25 సంవత్సరంలో జూన్ నెల చివరిలోపు కర్నూలు జిల్లాలో 45 లక్షలు, నంద్యాల జిల్లాలో 45 లక్షలు.. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 90 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. ఇప్పటికే 88 లక్షలకుపైగా పని దినాలు కల్పించారు. ఈ నెల చివరిలోపు లక్ష్యాన్ని చేరుకునేందుకు రెండు జిల్లాల నీటి యాజమాన్య సంస్థలు చొరవ తీసుకుంటున్నాయి. ఇప్పటి వరకు అత్యధికంగా సి.బెళగల్ మండలంలో 3,12,412 పని దినాలు కల్పించారు. తుగ్గలి 2,99,478, ఆదోని 2,98,839, పత్తికొండ 3,10,805, ఓర్వకల్లు 1,93,935, ఆస్పరి 2,27,468, హొళగొంద 2,05,855, ఆలూరు 2,11,817, కోసిగి మండలంలో 1,95,472 ప్రకారం పనిదినాలు కల్పించారు. నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, గడివేముల, కొలిమిగుండ్ల మండలాల్లో ఉపాధి పనులను వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకున్నారు.

అన్నదాతలకు అవసరమైన పనులు

ఉపాధి హామీ పథకం కింద అన్నదాతలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 1,68,652 పనులను గుర్తించారు. కర్నూలు జిల్లాలో 85,599, నంద్యాల జిల్లాలో 83,053 పనులు చేయాల్సి ఉంది. ఇందుకు పరిపాలనా అనుమతులు కూడా లభించాయి. ఫీడర్ చానల్స్, పర్క్యులేషన్ ట్యాంకులు, డకౌటు పాండ్స్, ఫాంపాండ్స్ తవ్వడం, రోడ్ల వెంట మొక్కలు నాటి పెంచడం, కందకాలు తవ్వకం వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వ్యక్తిగత ఆస్తుల అభివృద్ధి కింద భూముల ఉత్పాదకతను మెరుగుపరచడం, జీవనోపాధులను అభివృద్ధి పరిచే పనులు చేపడుతున్నారు. జూన్ నెలలో రోజుకు 153,500 పనిదినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా.. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 12 వేల మంది, నంద్యాల జిల్లాలో 4000 మంది వరకు మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ నెల మొదటి నుంచి విస్తారంగా వర్షాలు పడుతుండటంతో వ్యవసాయ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో 'ఉపాధి' పనులకు డిమాండ్ తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

పండ్ల తోటల అభివృద్ధి

ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది కర్నూలు జిల్లాలో 7,480 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 6,430 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే కర్నూలు జిల్లాలో 5,500, నంద్యాల జిల్లాలో 3,147 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి రైతులను గుర్తించారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉండి, జాబ్ కార్డు కలిగిన రైతులందరూ ఇందుకు అర్హులే. పరిపాలనా అనుమతులు కూడా లభిస్తుండటంతో పండ్ల మొక్కలు నాటుకునేందుకు గుంతలు తవ్వుకునే పనులకే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పండ్ల తోటల అభివృద్ధితో చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరనుంది.

> **కరువులో ఉపాధి ఆదుకుంది**
>
> 
>
> గతేడాది ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో ఉపాధి పథకం మమల్ని ఆదుకుంది. కరువు ఏర్పడితే మామూలుగా అయితే గుంటూరు ప్రాంతానికి వలస పోతుంటాం. అయితే గతేడాది ప్రభుత్వం ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పనులకు హాజరైన కూలీలకు గిట్టుబాటు వేతనం ఇచ్చింది. మాకు రోజుకు రూ.270 కూలి లభించింది. కరువులో ఉపాధి పనులు మాకు ఊరటనిచ్చాయి.
>
> –కే.ఈశ్వరప్ప, పల్లెపాడు గ్రామం, కోసిగి మండలం

> **అడిగిన వారందరికీ పని కల్పించాం**
>
> 
>
> కరువు మండలాల్లో ఉపాధి పనులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇచ్చాం. అడిగిన వారందరికీ పని కల్పించాం. ఉపాధి వేతనాల కింద కూలీలకు రూ.125.97 కోట్లు చెల్లించాం. పండ్లతోటల అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం గుంతలు త వ్వే పనులు చేపడుతున్నాం. ఈ ఏడాది జిల్లాలో 7,480 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేస్తున్నాం.
>
> – అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

కర్నూలు విజిలెన్స్ అధికారికి అదనపు బాధ్యతలు

కర్నూలు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారి నీలం పూజితకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పలువురు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు స్థాన చలనం కలిగింది. ఇందులో భాగంగా కడప, అనంతపురం జిల్లాల ఇన్‌చార్జ్ ప్రాంతీయ అధికారిగా ఉన్న షేక్ మాసూం బాషాను మాతృ సంస్థకు బదిలీ చేసి మంగళగిరిలో ఉన్న ఏపీ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నీలం పూజితకు అనంతపురం, కడప జిల్లాల ఇన్‌చార్జ్ బాధ్యతలను కూడా అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వైద్య పరీక్షలు బయటకు రాస్తే ప్రోత్సాహకంలో కోత

కర్నూలు(హాస్పిటల్): రోగులకు అవసరమైన వైద్య పరీక్షలను బయటి ల్యాబ్‌లకు రాస్తే లోకాయుక్త ఆదేశాల మేరకు సంబంధిత వైద్యుల ఆరోగ్యశ్రీ ప్రోత్సాహక నగదులో కోత విధిస్తామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి ఆర్ఎంవోలు ప్రతిరోజూ కేస్‌షీట్‌లు తనిఖీ చేస్తారన్నారు. యూనిట్ ఇన్‌ఛార్జిలు, హెచ్‌వోడీలు సైతం ల్యాబ్ పరీక్షలను ఆసుపత్రిలోని ల్యాబ్‌లోనే చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యపరీక్షలకు సంబంధించి అన్నిరకాల రీ ఏజెంట్స్ ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా సరఫరా ఉందన్నారు. వైద్యపరీక్షలకు సంబంధించిన పరికరాలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించుకోవాలన్నారు.

బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 29, 30వ తేదీల్లో నంద్యాల నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వంశీధర్ బుధవారం తెలిపారు. 29న అండర్–11, 13, 15 బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగంలో, 30న అండర్ –17, 19 బాలబాలికల విభాగంతోపాటు సీనియర్ విభాగంలో పురుషులకు, మహిళలకు సింగిల్స్, డబుల్స్‌లో విడివిడిగా పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 28 సాయంత్రం 5 గంటల్లోపు 8985809434 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కర్నూలును డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు:కర్నూలు జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని, వీటి నిర్మూలనలో ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీసు శాఖకు సహకరించాలని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా అంతటా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సీఐలు గౌతమి, పవన్ కుమార్, శ్రీధర్, రాజేంద్రప్రసాద్, నరసనాయుడుల ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై కర్నూలు సెబ్ స్టేషన్, పాత కంట్రోల్ రూమ్ మీదుగా నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులతో కలసి కొండారెడ్డిబురుజు వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి విద్యార్థులు, పౌర సమాజంతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ నాగరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులతో సమావేశమై ప్రధానంగా యువత, విద్యార్థులు మత్తు పదార్థాలతో జీవితాలు బుగ్గిపాలు చేసుకోకుండా చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా కర్నూలును తీర్చిదిద్దుతామన్నారు.

గురుకులాల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 6, 7, 8, 9వ తరగతిలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఆయా పాఠశాలల్లోనే పొందాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతపరిచి ఈ నెల 28లోగా అదే పాఠశాలల్లో అందజేయాలన్నారు. రాత పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, ఈ నెల 29న ఉదయం 10 గంటలకు దరఖాస్తు చేసుకున్న పాఠశాలలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు హా జరు కావాలన్నారు. ఇతర వివరాలకు 08518– 295601 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల్లో చివరి స్థానం

- 30.60 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత
- గత ఏడాది కంటే 15 శాతం తగ్గుదల

కర్నూలు సిటీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో కర్నూలు జిల్లా రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచింది. ఫలితాలను బుధవారం ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసింది. సప్లిమెంటరీ విద్యార్థులకు గతనెల 24 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు జిల్లాలోని 69 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు మూల్యాంకనం జరిపారు. జిల్లాలో మొత్తం 14,064 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. ఇందులో బాలికలు 5,270 మంది, బాలురు 8,794 మంది ఉన్నారు. పరీక్ష రాసిన వారిలో 4,303 మంది ఉత్తీర్ణులు అయ్యారు. వీరిలో బాలికలు 1,921 మంది, బాలురు 2,382 మంది ఉన్నారు. మొత్తం 30.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెగ్యులర్ పరీక్షల్లో ఎక్కువ శాతం మంది విద్యార్థులు గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులో ఫెయిల్ కాగా, సప్లిమెంటరీ పరీక్షల్లోనూ గణితం, సైన్స్ పాస్‌కాలేకపోయారు. గతేడాది 45 శాతం ఫలితాలు రాగా.. ఈ ఏడాది 30.60 శాతం మాత్రమే వచ్చాయి. పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో చివరి నుంచి రెండో స్థానంలో నిలవగా.. సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా చివరి స్థానాన్ని చేరుకుంది. ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్ల పనితీరుపై సరైన పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు నాలుగు రోజుల్లో మార్కులు జాబితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27 నుంచి జూలై 1వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం ఆయా స్కూల్ హెచ్ఎం, ప్రిన్సిపాల్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఇంటర్ సప్లిమెంటరీలో 40.6 శాతం ఉత్తీర్ణత

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. జిల్లాలో 40.6 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత నెల 24 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. జిల్లాలో మొత్తం 6,417 మంది ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2,605 మంది ఉత్తీర్ణులయ్యారు. గతంలో ఎన్నడూ కూడా లేని విధంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. అత్యధికంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు చెందిన విద్యార్థులు 57.45 శాతం, ఆరువాత ఏపీ మోడల్ స్కూళ్ల జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు 46.24 శాతం ఉత్తీర్ణులయ్యారు. వివిధ సొసైటీలకు చెందిన విద్యార్థులు 86 మంది పరీక్షలు రాయగా 53 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,770 మందికి 733 మంది, కేజీబీవీల్లో 188 మందికి 108 మంది, ఏపీ మోడల్ స్కూళ్లలో 465 మందికి 215 మంది పాసయ్యారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు చెందిన విద్యార్థులు 2,745 మంది పరీక్షలు రాస్తే 1,131 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

డిగ్రీ అడ్మిషన్లపై సందిగ్ధం

- ఆన్‌లైనా.. ఆఫ్‌లైనా?
- ఇప్పటివరకు నోటిఫికేషన్ ఇవ్వని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ
- ఇంటర్ ఫలితాలు వచ్చి రెండు నెలలైనా పట్టించుకోని వైనం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కళాశాలల వివరాలు

యాజమాన్యం	కళాశాల సంఖ్య	కోర్సుల సంఖ్య	సీట్ల వివరాలు (సుమారు)
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	14	42	2,000
ఎయిడెడ్ కళాశాలలు	6	32	3,435
ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు	68	25	2,340
మొత్తం	88	99	7,775

కర్నూలు కల్చరల్: ఇంటర్ ఉత్తీర్ణులై డిగ్రీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థుల్లో అయోమయం నెలకొంది. ఉన్నత విద్యాశాఖ ఇప్పటి వరకు డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా ఇంటర్మీడియట్ పరీక్షలు సంబంధించి ఫలితాలు వెలువడిన తరువాత డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వడం పరిపాటి. తదనుగుణంగా కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తుంటాయి. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, విద్యా మండలిలో డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి ఏవిధమైన చర్చ జరగకపోవటంతో ఇటు విద్యార్థుల్లో అటు కళాశాలల యాజమాన్యాల్లో అయోమయం నెలకొంది.

రెండు నెలలైనా..

రాష్ట్రంలో ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు దాటిపోయినా ఉన్నత విద్యా మండలి డిగ్రీ అడ్మిషన్ల గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. ఏప్రిల్ 12వ తేదీన ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ ఫలితాలను విడుదల చేసింది. అలాగే గత నెలలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సైతం నిర్వహించింది. ఇంటర్ సప్లిమెంటరీ ద్వితీయ సంవత్సరం ఫలితాలు సైతం ఇటీవలే విడుదలయ్యాయి. బుధవారం ఇంటర్ మొదటి ఏడాది సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సైతం విడుదల చేశారు. మార్చిలో జరిగే ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదల కాగానే ఉన్నత విద్యా మండలి డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేయడం, వాటి విధివిధానాలను రూపొందించి ప్రకటించడం చేస్తారు. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన పాలకులు డిగ్రీ అడ్మిషన్లపై ఎటువంటి నిర్ణయం చేయక పోవటంతో అధికారులు నోటిఫికేషన్‌పై నిర్ణయం తీసుకోవడం లేదని ఉన్నత విద్యాశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దాని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ అడ్మిషన్లపై సందిగ్ధత ఏర్పడింది.

ఆన్‌లైనా.. ఆఫ్‌లైనా..?

మూడేళ్ల క్రితం వరకు డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లోనే జరిగేవి. దాంతో నగరాల్లో ఉన్న కళాశాలల్లో సీట్లు పూర్తిగా నిండేవి. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలకు దూరంగా ఉన్న కళాశాలలు చిన్న విద్యా సంస్థల్లో సీట్లు నిండేవి కాదు. దాంతో పెద్ద కళాశాలలు తమ కిష్టమైన రీతిలో వ్యవహరించడంతో చాలా కళాశాలలు మూత పడే పరిస్థితులకు వచ్చాయి. వసతులు, మంచి అధ్యాపకులు, ఇతర మౌలిక సదుపాయాలున్నప్పటికి అడ్మిషన్ల విషయంలో వెనుకబడి ఉండేవి. ఆ క్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థులతో ఆర్థికంగా వెనుకబాటు కలిగిన విద్యార్థులు ఆర్థిక భారాలను ఎదుర్కోవాలిస వచ్చేదని నిపుణులు చెప్పటంతో ఆన్‌లైన్ దిశగా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు నిర్వహించడంతో విద్యార్థుల ప్రతిభ, వారి రిజర్వేషన్లు ఆధారంగా సీట్ల కేటాయింపులు తదనుగుణంగా విద్యా దీవెన పథకం అమలు చేశారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలమైన కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు తమకు ఆనలైన్ వద్దని, ఆఫ్‌లైన్‌లోనే సీట్లు నింపుకుంటామంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తీస్తున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.

గందరగోళంలో యాజమాన్యాలు

డిగ్రీ కోర్సులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి నోటిఫికేషన్ గాని ఇతర సమాచారం ఇవ్వకపోవటంతో కళాశాల యాజమాన్యాలు గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం తక్షణం దీనిపై నిర్ణయం తీసుకోవాలని కళాశాలల యాజమాన్యాలు కోరుతున్నాయి. అంతేకాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనా తరువాత విద్యా సంవత్సరం గందరగోళంగా తయారైంది. డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులు పూర్తిగా లేకుండా పోయాయి. మండే ఎండల్లో సైతం తరగతులను కొనసాగించాల్సిన పరిస్థితి వచ్చింది. తాజాగా డిగ్రీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చోటు చేసుకోవటంతో ఈ విద్యా సంవత్సరం సైతం ఆలస్యంగా ప్రారంభం కావటం, వచ్చే వేసవిలోనూ తరగతులు కొనసాగే పరిస్థితులు ఏర్పడతాయని కళాశాలల యాజమాన్యాలు అభిప్రాయపడుతున్నాయి.

కొత్తిమీర కొనలేం!

- బహిరంగ మార్కెట్లో కిలో రూ.200



నంద్యాల(న్యూటౌన్): కొత్తిమీర ధర కొండెక్కి కూర్చుంది. తెలుగు సంప్రదాయ వంటకాల్లో వాడే ఈ ఆకు ధర రోజురోజుకూ పెరుగుతోంది. మాంసాహారం, శాఖాహారం అనే తేడా లేకుండా ప్రతి వంటకంలో రుచి, వాసన కోసం కచ్చితంగా కొత్తిమీరను ఉపయోగిస్తారు. రుచితో పాటు ఆరోగ్యపరమైన లక్షణాలు కలిగి శారీరక సమస్యలను తొలగించడంలో కొత్తిమీర విశేషంగా తోడ్పడుతుంది. 15 రోజుల క్రితం వరకు సాధారణంగా ఉన్న కొత్తిమీర ధర ఒక్కసారిగా ఆకాశాన్నంటుతోంది. నంద్యాల కూరగాయల మార్కెట్లో పదిహేను రోజుల క్రితం హోల్‌సేల్‌గా కిలో రూ.60 ఉన్న కొత్తిమీర ధర.. ప్రస్తుతం రూ.160కు చేరింది. ఇక వ్యాపారులు రవాణా, తరుగు చార్జీలు, లాభం కలుపుకొని బహిరంగ మార్కెట్లో కిలో రూ.200 వరకు విక్రయిస్తున్నారు. ఈ పంట స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల హోల్‌సేల్ వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పంట దిగుబడి తగ్గడంతో కొత్తిమీర దిగుమతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. గత జనవరిలో కిలో రూ.20 కూడా పలకకపోవడంతో పలువురు రైతులు కొత్తిమీర సాగుకు ఆసక్తి చూపలేదు. దీంతో వేసవికాలం ప్రారంభమయ్యే నాటికి కొత్తిమీర దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీనివల్ల హోల్ సేల్ వ్యాపారులు, దళారులు ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి కొత్తిమీరను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ నుంచి శీతలీకరణ యంత్రాలను అమర్చిన వాహనాల్లో అత్యంత జాగ్రత్తగా జిల్లాకు తీసుకొస్తున్నారు. ఇది ఎక్కువ రోజులు నిల్వ ఉండే పంట కాకపోవడంతో కుళ్లిపోతుందనే భయంతో వ్యాపారులు వీలైనంత తక్కువగా దిగుమతి చేసుకుని అధిక ధరకు విక్రయిస్తున్నారు. కాగా జిల్లాలోని అయ్యలూరు, చాగలమర్రి, ముత్యాలపాడు తదితర ప్రాంతాల్లో సాగు చేసిన కొత్తిమీర అందుబాటులోకి వచ్చేవరకు ధర తగ్గే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

కోలుకోలేక వ్యక్తి మృతి

మహానంది: ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గాజులపల్లె గ్రామానికి చెందిన చౌటుపల్లి శివ(44) మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో ఈనెల 22న మద్యం తాగేందుకు కుటుంబ సభ్యులు డబ్బు ఇవ్వడంలేదని మనస్తాపానికి గురై ఉరి వేసుకున్నాడు. గమనించి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలు సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఐదురోజుల తర్వాత కోలుకోలేక బుధవారం తెల్లవారుఝామున మృతి చెందాడు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

చెల్లని చెక్కు ఇచ్చిన ఆర్‌ఎంపీకి జైలు

కర్నూలు(లీగల్): తన అవసరాలకు అప్పు తీసుకుని చెల్లని బ్యాంక్ చెక్కు ఇచ్చిన కేసులో ఆర్‌ఎంపీకి ఏడాది జైలు శిక్ష, మూడున్నర లక్షల రూపాయల జరిమానా విధిస్తూ కర్నూలు అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి.జ్యోత్స్ని దేవి బుధవారం తీర్పు చెప్పారు. కర్నూలుకు చెందిన ఎస్.గోకారి బాషా వద్ద గద్వాల జిల్లా ఉండవల్లికి చెందిన ఆర్‌ఎంపీ ఎస్.మహబూబ్ బాషా 2018 జనవరి 29న కుటుంబ అవసరాల కోసం రూ.2,10,000 అప్పు తీసుకున్నారు. అందుకుగాను ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. చెల్లింపులో భాగంగా 2019 నవంబర్‌లో రూ.1,75,000 బ్యాంకు చెక్కు ఇచ్చాడు. బ్యాంకు ఖాతాలో సరైన నిల్వలు లేక ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో గోకారి బాషా తన న్యాయవాది ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసును విచారించిన న్యాయాధికారి మహబూబ్ బాషాకు జైలు శిక్షతో పాటు ఇచ్చిన చెక్కుకు రెండింతల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 1,584 మంది పాస్

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం వెల్లడైనట్లు డీవీఈఓ సునీత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4,331 మంది ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాయగా 1,584 మంది(36.06 శాతం) ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 399 మందికి గానూ 221 మంది(43.06 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఇసుక లారీలు సీజ్



పోలీస్ అవుట్‌పోస్టులో ఉంచిన లారీలు

శ్రీశైలంప్రాజెక్ట్: సరైన పత్రాలు లేని రెండు ఇసుక లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రమేష్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన షేక్ మాబూవలి, బొజ్జా లక్ష్మయ్య తమ లారీలలో సున్నిపెంటకు ఇసుకను రవాణా చేస్తున్నట్లు తెలిపారు. రింగ్ పార్క్ సమీపంలో గస్తీ నిర్వహిస్తున్న తమ సిబ్బంది గుర్తించి తనిఖీలు చేయగా సరైన పత్రాలు లేకపోవడంతో లారీలను సీజ్ చేసి అవుట్ పోస్టులో ఉంచినట్లు తెలిపారు.

ప్రకృతి పుష్పగుచ్ఛం

వరుణుడి కరుణతో నింగి పరవశిస్తోంది.. నేల పులకిస్తోంది.. చైతన్యం పురుడు పోసుకుని.. విత్తులో నుంచి సరికొత్త జీవం బయటకొస్తోంది.. ప్రకృతిలో నూతనత్వం కనువిందుచేస్తోంది. ఇప్పటి వరకు బండరాళ్లతో, మోడుబారిన వృక్షాలతో దర్శనమిచ్చిన ఎర్రమల కొండ పచ్చందాలను అద్దుకుంది. నెర్రలిచ్చి, పిచ్చి మొక్కలు కూడా మొలవని పొలం పైరుతో కళకళలాడుతోంది. కర్నూలు సమీపంలో ఓ వృక్షం సగం పచ్చని ఆకులు, పైనంతా విరబూసిన పుష్పాలతో అచ్చం పుష్పగుచ్ఛాన్ని తలపిస్తూ ప్రకృతి ప్రేమికుల మదినిదోస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



నిధుల పెంపుతోనే స్థానిక సంస్థల బలోపేతం

- జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి
- ఐదో ఆర్థిక సంఘం సభ్యులకు సలహాలు, సూచనలు

కర్నూలు(అర్బన్): పెరిగిన జనాభాకు అనుగుణంగా నిధుల పెంపుతోనే స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో రాష్ట్ర ఐదో ఆర్థిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జెడ్పీ ఆదాయ, వ్యయాలు, పన్నుల వసూళ్లు, ప్రాథమిక అవసరాలు, పాలనలో ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై ఉమ్మడి జిల్లాకు చెందిన డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, ఎంపిక చేసిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐదో ఆర్థిక సంఘం మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ కేవీ రమణారెడ్డి, సభ్యులు ప్రొఫెసర్ ఎం ప్రసాదరావు, ప్రొఫెసర్ ఎంవీఎస్ పద్మారావు, కాకి కృపారావు, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల పంచాయతీ అధికారులు టీ నాగరాజునాయుడు, మంజులవాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి పలు సూచనలకు సంబంధించిన వినతి పత్రాన్ని ఆర్థిక సంఘానికి అందించారు.



ఆర్థిక సంఘం సభ్యులకు బొకే అందిస్తున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

జెడ్పీ చైర్మన్ ఇచ్చిన సూచనలు ఇవీ..

- 2021లో జనన గణన జరగనందున, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో పంచాయతీరాజ్ సంస్థలకు 2011 జనాభా లెక్కల ప్రకారం విడుదల చేస్తున్నారు. పెరిగిన జనాభాను అనుసరించి నిధులను పెంచాల్సిన అవసరం ఉంది.
- ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు మండల పరిషత్‌కు రూ.3 లక్షలు, జెడ్పీ స్థాయీ సంఘాలకు రూ.5 లక్షలు, జెడ్పీ సర్వసభ్య సమావేశానికి రూ.10 లక్షల వరకు అంచనా విలువ కలిగిన పనులకు ఆమోదం తెలిపే అధికారం ఉంది. వివిధ వస్తు, సామగ్రి విలువలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈ అంచనా మొత్తాన్ని ఎంపీపీలకు రూ.10 లక్షలు, జెడ్పీ స్థాయీ సంఘాలకు రూ.30 లక్షలు, జెడ్పీ సర్వసభ్య సమావేశానికి రూ.50 లక్షలు మేర పెంచాలి.
- సీనరేజ్ ఫీజుకు సంబంధించి జిల్లా పరంగా జమ చేసిన మొత్తాన్ని పంచాయతీరాజ్ సంస్థలకు వర్గీకరించి విడుదల చేయాలి.
- ఇసుక అమ్మకాల ద్వారా జమ అయిన సీనరేజి నిధులను 2019 సెప్టెంబర్ 4 నుంచి 2021 ఏప్రిల్ వరకు, అలాగే 2022 ఏప్రిల్ నుంచి నేటి వరకు పంచాయతీరాజ్ సంస్థలకు వర్గీకరించి విడుదల చేయాలి.
- స్టాంప్ డ్యూటీకి సంబంధించిన సర్దుబాటు మొత్తాలను సకాలంలో చేసే విధంగా రిజిస్ట్రేషన్ శాఖకు సూచనలు ఇప్పించాలి.
- జెడ్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 60 సీపీడబ్ల్యూఎస్ పథకాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు సరిపోనందున విద్యుత్ బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పథకాల సక్రమ నిర్వహణకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి.
- గ్రామ పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలకు గౌరవ వేతనం, అటెండెన్స్ అలవెన్స్, టీఏ చెల్లింపులకు బడ్జెట్ విడుదల చేయాలి.
- పలువురు సర్పంచులు మాట్లాడుతూ.. పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు కావాలంటే, ప్రభుత్వ సంక్షేమ పథకాల దరఖాస్తుకు పన్నులు చెల్లించిన రసీదులు జతపరచాలనే నిబంధన పెట్టాలని సూచించారు. గ్రామ సచివాలయా లు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్‌ను సచివాలయ పరిధిలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో తమ దృష్టికి వచ్చిన సలహాలు, సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని ఆర్థిక సంఘం సభ్యులు తెలిపారు.

తాగునీరు కలుషితమైతే వ్యాధులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): తాగునీరు కలుషితమేతే అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం స్థానిక జొహరాపురం పరిధిలోని నేతాజీనగర్‌లో ఉన్న 40వ సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో నీరు కలుషితం కావడం వల్ల ప్రజలకు వాంతులు, విరేచనాలు మొదలై అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. నీరు కాచి చల్లార్చి, వడబోసి తాగాలని, భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. ఇంటింటి సర్వే చేస్తూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేది వరకు ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలను పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త శైలజ, ఆశా కార్యకర్త వెంకటేశ్వరి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి



మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి



పాల్గొన్న ప్రభుత్వ నర్సింగ్ ట్రైనింగ్ విద్యార్థులు

కర్నూలు (లీగల్): సమాజం నుంచి మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని, దేశ సమగ్రాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం న్యాయ సేవ సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చట్టపరమైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమాషాగా మొదలై అది లేకుంటే బతకలేమనేంత బానిసలుగా మార్చే శక్తి మాదకద్రవ్యాలకు ఉందన్నారు. ప్రపంచాన్ని గుప్పిటపెడుతూ చాపకింద నీరులా విస్తరిస్తున్న విషసంస్కృతికి చరమగీతం పాడాలన్నారు. విస్తరించడానికి అందివచ్చిన ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకుండా డ్రగ్స్ మాఫియా అంతటా వేళ్లానుకుంటోందని, తీవ్రవాదానికి సహాయకారిగా మారుతోందని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రభుత్వానికి పెనుసవాలుగా తయారైందన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలను వాడుతూ ఆరోగ్యాన్ని చెడగొట్టుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ వాడకం నేరమని, అందుకు విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ ట్రైనింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అలజడి రేపుతున్న దొంగల ముఠా!

- పోలీసుల అదుపులో పాత నేరస్తులు



కర్నూలు: దొంగల ముఠా కదలికలు కర్నూలులో అలజడి రేపుతున్నాయి. వరుసగా జిల్లాలో జరుగుతున్న చోరీలు ఇందుకు ఊతమిస్తున్నాయి. హైదరాబాద్, గద్వాల, మహబూబ్ నగర్, గుంతకల్లు, పామిడి తదితర ప్రాంతాలకు చెందిన పాత నేరస్తులు జిల్లాలో చేతి వాటం ప్రదర్శించి అందినమటుకు దండుకుని పరారవుతున్నట్లు పోలీసు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇళ్లలో చోరీ చేసి అవసరమైతే దాడి చేసేందుకు వెనుకాడని దొంగలు శివారు కాలనీల్లో సంచరిస్తున్నారన్న ప్రచారం కొంతకాలంగా ఊపందుకుంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన పెంచుతోంది. దొంగతనాల్లో ఆరితేరిన ముఠా సభ్యులు జిల్లాలో సంచరిస్తున్నట్లు బాధితుల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా శివారు ప్రాంతాలు, దూరంగా విసిరేసినట్లు ఉండే కాలనీల్లోని ఇళ్లల్లో దొంగతనాలు చేసే ముఠాకు చెందిన ఇద్దరిని నాల్గవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పగటిపూట కాలనీల్లో రెక్కీ చేసి అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి చేతివాటం ప్రదర్శించి సొమ్ములు మూటగట్టుకుని ఉడాయిస్తున్న పొరుగు జిల్లాల ముఠాలు జిల్లాలో సంచరిస్తున్నట్లు పోలీసు వర్గాలు కూడా అనుమానిస్తున్నాయి.

పోలీసుల అదుపులో పాత నేరస్తులు....

కోడుమూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన రామగిడ్డయ్య అనే పాతనేరస్తుడిని అనుమానంపై నాల్గవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పెద్దపాడు సమీపంలోని రాజీవ్ గృహకల్పతో పాటు శివారు కాలనీల్లో పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించినట్లు సమాచారం. చోరీ చేసిన సొత్తును ప్యాలకుర్తి గ్రామానికి చెందిన వ్యక్తికి విక్రయించినట్లు అతను అంగీకరించడంతో మంగళవారం అర్ధరాత్రి విజయ్ యాదవ్ (బంగారు కొనుగోలుదారుడు) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని క్రైం పార్టీ పోలీసులు విచారిస్తున్నారు. వారి వద్ద నుంచి భారీగానే బంగారం రికవరీ చేసినట్లు సమాచారం. కర్నూలులో వ్యాపార సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల ముందు పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలు కొంతకాలంగా పెద్ద మొత్తంలో చోరీకి గురయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో సీసీ ఫుటేజీల ఆధారంగా కొందరు పాత నేరస్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అలాగే సి.క్యాంప్ రైతుబజార్, కొత్తబస్టాండ్‌లను అడ్డాలుగా చేసుకుని సెల్ ఫోన్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ హయాంలో సెల్‌ఫోన్ల రికవరీ భారీగా జరిగింది. ఆ తర్వాత పోలీసులు వాటి రికవరీపై దృష్టి సారించకపోవడంతో దొంగలకు అవకాశంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతి చెందిన దాసు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామానికి చెందిన జవ్వాజీ దాసు(62) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన జవ్వాజీ దాసు రైల్వే గేటు నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో కొద్దిదూరంలో తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని నంద్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తల, ఛాతికి తీవ్ర గాయాలు ఉండటంతో గుర్తు తెలియని వాహనం ఢీకొందా? లేక ఎవరైనా దాడి చేశారా? అనేది అనుమానంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారిణి హేమలత, చిత్రంలో డాక్టర్ శైలేష్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారిణి హేమలత చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజి ఆవరణలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో క్యాన్సర్ స్క్రీనింగ్ మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. క్షేత్రస్థాయిలో నిర్ధారిత సమయంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు ప్రజలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, పర్యావరణ కాలుష్యం క్యాన్సర్ రావడానికి కారణమని చెప్పారు. డాక్టర్ శైలేష్‌కుమార్ మాట్లాడుతూ పెళ్లికి ముందు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించడం ద్వారా వ్యాధి రాకుండా నివారించవచ్చన్నారు. మహిళలు తరచూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భాశయంలోని కణాలు అసాధరణంగా, నియంత్రణ లేకుండా విభజించబడి పెరుగుదల ఏర్పడినప్పుడు దానిని క్యాన్సర్ అంటారన్నారు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే అది బాధాకరమైన మరణానికి దారి తీస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల రక్షణకు చర్యలు

మహానంది: మహానంది ఆలయ పరిసరాల్లో చిరుత సంచరిస్తుండటంతో భక్తులకు రక్షణ కల్పించేందుకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. భక్తులు సాధారణంగా రాత్రి వేళలో ఆలయం ముందు ఉన్న సుపథ మండపాల్లో నిద్రిస్తారు. అయితే చిరుత సంచారం నేపథ్యంలో భక్తులు ఎవరూ మండపాల్లో నిద్రించవద్దని ఖాళీ చేయించారు. వారికి టీటీడీ కల్యాణ మండపంలో తాత్కాలికంగా వసతి కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో నేలను కాపాడుకుందాం

- బయోచార్‌పై రైతులకు అవగాహన పెంచండి
- ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆత్మ డీపీడీ శ్రీలత సూచనలు



బయోచార్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఆత్మ డీపీడీ శ్రీలత

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిని నేలను కాపాడుకుందామని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత అన్నారు. ప్రకృతి వ్యవసాయ సిద్ధాంతాలు, దాని వెనుక ఉన్న శాస్త్రీయతపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని చెప్పారు. బుధవారం స్థానిక ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ డీపీడీ మాట్లాడుతూ...రసాయన ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినిందని, ఇప్పటికైనా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతుల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో బయోచార్ వాడకం వల్ల నేల యొక్క భౌతిక, రసాయనిక జీవ సంబంధమైన లక్షణాలు మెరుగుపడుతాయన్నారు. నేలలో సూక్ష్మ జీవుల వైవిధ్యాన్ని పెంచడం ద్వారా సేంద్రియ కర్బణం పెరిగి మొక్కలకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. కెమికల్స్‌తో పండించిన పంటల్లో వాటి అవశేషాలు ఉంటున్నాయని శాస్త్రీయంగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యవంతమైన పంటలు పండించుకుందామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బయోచార్ తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, డీపీఎం చంద్రశేఖర్, ఆత్మ ఏఓ మధుమతి, బీటీఎం చక్రవర్తి, కన్సల్టెంటు లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు సమాయత్తం

ఉయ్యాలవాడ : ఈ ఏడాది సీజన్‌కు ముందుగా మంచి వర్షాలు కురిశాయి. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి నదిలో వరద నీరు వచ్చి చేరుతోంది. నీరు సమృద్ధిగా విద్యుత్ మోటార్లకు అందుతుండటంతో మండలంలో కుందూ నదీ తీరం వెంటనున్న 14 గ్రామాల రైతులు ఖరీఫ్ సీజన్‌లో భాగంగా వరి పంట సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి సాగుకు ముందు భూసారం పెంచేందుకు ప్రభుత్వం రాయితీ జీలుగలు మంజూరు చేయడంతో పొలాల్లో చల్లారు. ప్రస్తుతం జీలుగ ఏపుగా పెరుగుతుంది.

వరి సాగుపై రెట్టింపు ఆశలు..

మండలంలోని రైతులు రెట్టింపు ఆశలతో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో మంచి దిగుబడులు లభించాయి. ఎకరాకు 42 నుంచి 46 బస్తాలు సాధించారు. అలాగే దిగుబడులకు మార్కెట్‌లో మంచి ధర లభించింది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం వరికి మద్దతు ధర క్వింటా రూ.2,320కు పెంచింది. సాధారణ విస్తీర్ణం 980 హెక్టార్లు ఆ ఆశతో ఈ ఏడాది 1,200 హెక్టార్ల వరకు వరి సాగయ్యే అవకాశముందని వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. మంచి దిగుబడులు వస్తాయన్న ఆశాభావంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కుందూనదిలో నెల కొన్న గుర్రపుడెక్క నదిలో ప్రవాహ వేగానికి అడ్డుగా నిలుస్తుంది. ఉయ్యాలవాడ వద్ద వంతెన సమీపంలో గుర్రపుడెక్క ఇరువైపులా అడ్డుగా ఉండిపోవడంతో విద్యుత్ మోటార్లకు నీటి అందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. గుర్రపుడెక్కను కేసీ కెనాల్ అధికారులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



మాయలూరు వద్ద సాగు చేసిన వరి నారు